
సాక్షి
జనగామ

బుధవారం | 10 | ఏప్రిల్ | 2024




ఉత్తీర్ణత అంతంతే..
కేయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో కూడా వేలాది మంది విద్యార్థులు ఫెయిలవుతున్నారు.
- 8లో▸



గోవుల పట్టివేత
కరీంనగర్ నుంచి పాలకుర్తి మండలానికి అక్రమంగా తరలిస్తున్న గోవులను హిందూ సంఘాల బాధ్యులు పట్టుకున్నారు.
- 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37⁰ /24⁰

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన



చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రీక్రోధ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం భక్తుల జనసందోహం నడుమ 108 బంగారు పుష్పాలతో అష్టాదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదాలను అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామి వారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బంది రమేష్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, వసంత, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు భక్తులు పాల్గొన్నారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు.

మే 6 నుంచి డిగ్రీ 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడివరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ బీబీఏ బీఏ (ఎల్‌ఎం) సంబంధించిన రెండవ, ఆరవ సెమిస్టర్ పరీక్షలు మే 6వ తేదీనుంచి, డిగ్రీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షలు మే 7వ తేదీనుంచి జరగనున్నాయి. రెండవ సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు. ఆయా డిగ్రీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. ఆరవ సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25, 28, 30,31, జూన్ 1, జూన్ 3 తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనున్నట్లు వారు తెలిపారు.

మినిస్టర్స్ క్వార్టర్స్‌లోకి కొండా దంపతులు



వరంగల్: రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు దంపతులు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టారు. మంత్రి సురేఖ దంపతులు, వారి కూతురు సుస్మిత పటేల్, అల్లుడు అభిలాష్‌తో కలిసి గృహ ప్రవేశ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎప్పటిలాగే ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

ఖిలా వరంగల్: భూ కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు అచ్చ వినోద్‌కుమార్ కోరారు. తూర్పుకోట రహదారిలో భూ ఆక్రమణపై వినోద్‌కుమార్ మంగళవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుకోట రోడ్డులోని సర్వే నంబర్ 159లో పట్టాదారులు తూర్పుకోటకు చెందిన గోపు సుదర్శన్, గోవర్ధన్ ఇద్దరు అన్నదమ్ములు తన సొంత భూమిని 110 ప్లాట్లు చేయగా..వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీకి చెందిన అచ్చ వినోద్‌కుమార్ 1985లో డాక్యుమెంట్ నంబర్ 1917/85 ప్రకారం 32వ ప్లాటు 300 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ ప్లాటును మరోసారి పట్టాదారులు మృతిచెందగానే గోవర్ధన్ భార్య యాదమ్మ 2010లో గన్ను వెంకటేశ్వర్లకు రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల ఏర్పాటు చేసుకున్న ఫెన్సింగ్‌ను గన్ను వెంకటేశ్వర్లు ధ్వంసం చేసి ఆర్థికంగా నష్టపర్చాడని, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన యాదమ్మ, ఫెన్సింగ్ ధ్వంసం చేసిన వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

విద్యార్థులకు వరం.. బీసీ గురుకులం

గురుకుల సంక్షేమ కళాశాలల్లో ప్రవేశాలకు అవకాశం
- ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఇంటర్‌లో ఉచిత విద్య, వసతి
- ఐఐటీ, నీట్‌లో శిక్షణ
- 'సూపర్ 100' పేరిట ప్రత్యేక కోచింగ్
- జిల్లాలో 5 బీసీ గురుకులాలు



జనగామ రూరల్: పదో తరగతి పూర్తి చేసి.. ప్రతిభావంతులైన పేద వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించేందుకు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాలు వరంగా మారాయి. పేద విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వెస్తున్నాయి. పేద మధ్య తరగతి విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, నీట్ ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందిస్తూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5 గురుకుల కళాశాలలు ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరాలనికి గాను ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తు అహ్వానిస్తుంది. పేద విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాలలు, హాస్టళ్లలో ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తమ పిల్లలను గురుకులంలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్, ఒకేషనల్ ఆంగ్లమాధ్యమం విద్యతో పాటు ఉచిత భోజనవసతి కల్పిస్తారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్‌లను పాటిస్తూ ప్రవేశాలు కల్పిస్తారు.

గ్రామీణ విద్యార్థులకు వరం

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను నేర్చుకోవాలనే వారికి మంచి అవకాశమని తల్లిదండ్రులు బావిస్తున్నారు. కూలీ పనులు చేసుకునే వారి పిల్లలు ప్రైవేట్ కళాశాలలో చెర్పించ లేని పరిస్థితి. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి చదివించలేని వారు ఉన్నారు. వారి కోసం ప్రభుత్వం 2017 జూన్‌లో గురుకులాల విద్యాలయాలను ప్రారంభించింది. ఈ గురుకులాలను విద్యార్థులు వినియోగించుకుని బంగారు భవిష్యత్ బాటలు వేసుకునేందుకు ఒక వరంగా గురుకులాలు పని చేస్తున్నాయి . జిల్లాలో బచ్చన్నపేట బాల బాలికలకు, రెండు వేరు వేరు గురుకులాలు ఉన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్‌లో బాలురు ఉండగా రఘునాథపల్లిలో బాలికలు, మొండ్రాయిలో బాలికల కళాశాలలు ఉన్నాయి. 5 కళాశాలలో 500 వందల వరకు సీట్లు ఖాళీలు ఉంటాయి.

అర్హతలివే..

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరంలో పదో తరతి రెగ్యూలర్‌గా పూర్తి చేసి వారు అర్హులు. సప్లిమెంటరీ పరీక్ష రాసిన వారికి అవకాశం లేదు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలు, పట్టణంలో ఉంటున్నవారికి రూ.2లక్షల ఆదాయం ఉండాలి. మీ సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

రిజర్వేషన్లు ఇలా..

బీసీ గురుకులాల్లో బీసీలకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం ఓ బీసీలకు 2 శాతం, అనాథలకు 3 శాతం, దివ్యాంగులకు 3 శాతం బీసీ గురుకులాలైన సంక్షేమ హస్టళ్లలో చదువుకుంటున్న వారికి 25 శాతం కెటాయించారు.

ప్రత్యేకతలివే..
- కళాశాలలో ఉచిత విద్యతో పాటు, వసతి, భోజనం
- ఆంగ్ల మాధ్యమంలో బోధన, డిజిటల్ క్లాస్‌లు
- విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం
- విద్యార్థులకు సరిపడా ఆట స్థలం, మౌలిక సదుపాయాలు, గ్రంథాలయంలో పుస్తకాలు
- ఉచిత మెటీరియల్, యూనిఫాం, నోట్ బుక్స్ అందజేత
- నిరంతరం అధ్యాపకుల పర్యవేక్షణ
- ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ, ఎంసెట్, నీట్‌లో ప్రత్యేక శిక్షణ
- సూపర్ 100 బ్యాచ్‌గా ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్



గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మంచి అవకాశం. గురుకులాల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా బోధన ఉంటుంది.
- అనిత, ప్రిన్సిపాల్, ఎంజేపీ బాలికల కళాశాల జనగామ

కలిసొచ్చే శ్రీ క్రోధి నామ ఉగాది



గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో భక్తుల పూజలు



ఉగాది పచ్చడి తీసుకుంటున్న కుటుంబ సభ్యులు

జనగామ ఆదాయం 14, వ్యయం 14
- ఎర్రని నేలల్లో వేరుశనగ, కందులు, మెట్ట పంటలకు లాభం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం, భక్తి శ్రద్ధలతో ఉగాది పండగ



బాణాపురం వేంకటేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం

జనగామ: జీవితంలో కష్ట సుఖాలు, చీకటి వెలుగులు ఒకేలా స్వీకరిస్తూ దృఢ చిత్తంతో ముందుకు సాగాలనే దివ్యసందేశాన్ని »ఉగాది« పర్వదినం అందిస్తుంది. జీవన గమనంలో ఎదురయ్యే వివిధ సంతోషాలు, సంబురాలు, వినోదాలు, విషాదాలు, తీపి, కారం, ఉప్పు, పులుపు, వగరు, చేదుల ప్రతి రూపమై, షడ్రుచుల సమ్మేళనమైన శ్రీ క్రోధి నామ ఉగాది పండగను భక్తి శ్రద్ధలతో స్వాగతం పలికారు. భూత, భవిష్యత్, వర్తమాన కాలా గురించి తెలియజేసే పంచాంగ శ్రవణానికి ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. ఉగాది పర్వదిన వేడుకల్లో ప్రత్యేకత సంతరించుకునే పంచాంగ శ్రవణాన్ని పండితులు రాశుల వారీగా వారి భవిష్యత్‌ను వినిపించారు.

జనగామ ఆదాయం 14..

జిల్లా వ్యాప్తంగా శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే తలంటుస్నానం ఆచరించి, ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు పేర్చి, షడ్రుచులతో కూడిన పచ్చడి తయారు చేసి, మొదటగా దేవతలకు నైవేద్యం సమర్పించిన అనంతరం కుటుంబ సమేతంగా సేవించారు. సాయంత్రం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో వేద పండితులు, పూజారులు పంచాంగ శ్రవణం చెప్పారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వర, కొడవటూరు సిద్ధేశ్వర, చిల్పూరు శ్రీ బుగులోని వేంకటేశ్వర, జనగామ పట్టణంలోని పాత బీటు శ్రీ రామలింగేశ్వర, శ్రీ సంతోషీ మాత, గ్రేయిన్ మార్కెట్ శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ చెన్నకేశ్వర, గీతాశ్రమం, గుండ్లగడ్డ ఉమామహేశ్వర, గీతాశ్రమం, జీడికల్ శ్రీ సీతారామాంజనేయ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు పంచాంగ శ్రవణంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

శుభం–లాభం

చేతి వృత్తులు, కిరాణ, వర్తక వ్యాపారం, క్రీడారంగం, న్యాయ పరమైన వృత్తి, ఎర్రని నేలల్లో మెట్ట పంటలు, పాస్‌పొటో, వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు, పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు శుభ ఫలితాలు ఉండగా.. రాజకీయ ఒడిదొడుకులు, అనారోగ్యమైన సమస్యలు, అభివృద్ధి జరిగినా స్థిరత్వం లేకపోవడం జరుగుతుందని పంచాంగ శ్రవణంలో పలువురు పండితులు వినిపించారు. జనగామ పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ, కలహాలు, ధననష్టం, సర్వజన విరోధం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. ఉద్యోగుల ఆర్థిక పరిస్థితులు మెరుగు పడగా, ప్రైవేటులో పని చేసే వారికి కొన్ని ప్రాంతాల్లో స్థానచలనం ఉంటుందని వివరించారు.

శాంతించిన సూరీడు

జిల్లాలో వారం రోజులుగా 44 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలను ఇంటి గడప దాటకుండా చేసిన సూరీడు.. రెండు రోజులుగా శాంతించాడు. సోమ, మంగళవారాల్లో 37.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదు కావడంతో ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండగ వేడుకలను జరుపుకున్నారు. దీనికి తోడు చల్లని గాలులతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



జనగామ రూరల్: సమాజాభివృద్ధికి ఓటు హక్కు ఎంతో దోహదపడుతుందని, యువత బాధ్యతగా గుర్తించి నమోదు చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. మంగళవారం కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు నమోదును పెంచేందుకు అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని, ప్రజలకు కూడా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు పొందేలా కృషి చేయాలన్నారు. ఓటు హక్కు విశిష్టతను తెలియజేస్తూ చైతన్యవంతులను చేయటకు ఓటును వినియోగించుకునేలా విస్తృతంగా క్షేత్ర స్థాయిలో ప్రచారం చేసి అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలో ఆసక్తి కలిగిన విద్యార్థులను బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తించి 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన ఉండేలా ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. ఓటరుగా నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రహరీ నిర్మించరూ..



ప్రహరీ లేని కేజీబీవీ

- భయాందోళనలో కేజీబీవీ విద్యార్థినులు
- జెడ్పీ చైర్మన్ మృతితో ఆగిన పనులు

చిల్పూరు: మండలంలోని రాజవరం, తీగలతండా గ్రామపంచాయతీల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి (కేజీబీవీ) నూతన భవనం ఉన్నా ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. నాలుగేళ్ల క్రితం కేజీబీవీకి నూతన భవనం నిర్మించిన సమయంలో ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయాన్ని జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా రూ.83 లక్షల నిధులు మంజూరు చేశారు. గతేడాది ఫిబ్రవరి 27న అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. అనంతరం ఇసుక, కంకర, సిమెంట్, ఇటుకలు తెప్పించి పనులు మొదటి పెట్టే సమయంలో సంపత్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి నేటి వరకు పనులు మొదలు కాలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థినులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



విద్యాలయంలో వసతులు బాగానే ఉన్నాయి. కానీ భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. సాయంత్రం బయటకు రావాలంటే భయమేస్తున్నది.
- గీత, 8వ తరగతి

ప్రహరీ ఉంటే మేలు..



సాయంత్రం కాసేపు బయట ఆడుకోవాలంటే ప్రహరీ లేకపోవడంతో రాలేకపోతున్నాం. కుక్కలు తిరుగుతున్నాయి. ప్రహరీ ఉంటే ఇబ్బంది ఉండదు.
- సిరిచందన, 9వ తరగతి

సమస్యల పరిష్కారానికి కృషి

కాశీబుగ్గ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పీఆర్టీయూ తెలంగాణ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సంగీత అన్నారు. పీఆర్టీయూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం హనుమకొండలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఉపాధ్యాయుల ఆకాంక్షకు అనుగుణంగా తమ సంఘం పనిచేస్తుందని తెలిపారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు, 317 జీఓ బాధిత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్, కోశాధికారి సర్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పాతబీటు బజారులో శ్రీరామ నవరాత్రి వేడుకలు



ఉత్సవాల్లో ఎమ్మెల్యే పల్లా



సంతోషిమాత ఆలయంలో..



శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలు షురూ

జనగామ: జిల్లా వ్యాప్తంగా శ్రీ రామ నవరాత్రి ఉత్సవాలు మంగళవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో ప్రతి రోజు అన్నదానం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పట్టణంలోని 27వార్డు పాత బీటు బజారు శ్రీరామనవమి పందిరి వద్ద గణేష్ ఫ్రెండ్స్ యూత్ శ్రీరామనవమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏడు దశాబ్దాలుగా శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వేద పండితులు మేళ్లచెరువు అప్పయ్య శాస్త్రి, ప్రసాద శర్మ, ప్రసాద్ శర్మ, గోవిందు శర్మ, రాఘ వ శర్మ, ఆంజనేయశర్మ మంత్రోచ్చారణల నడుమ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా మండపం వద్దకు తీసుకువచ్చారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఎమ్మెల్యేకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. హెడ్‌పోస్టాఫీసు ఆవరణలోని శ్రీ సంతోషీమాత ఆలయంలో ప్రధాన పూజారి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, పజూరి గోప య్య, కమిటీ సభ్యులు పోకల వేణు, అయిత శ్రీకాంత్, సోమ హనుమంత రావు, నందు బజాజ్, బచ్చు అశోక్, బుస్సా పాండు, పబ్బా చంద్రశేఖర్, అరుగుల శ్రీనివాస్, హరి ప్రసాద్, గోవింద్ లోహియ, కౌన్సిలర్స్ తాళ్ల సురేష్ రెడ్డి, ముస్త్యాల దయాకర్, నీల రామ్మోహన్, గజ్జెల నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఉత్సవ మూర్తులు

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

జనగామ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు (బుధవారం) భువనగిరి ఎంపీ జనగామ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేట రోడ్డులోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

భక్తులతో పోటెత్తిన పకీర్ షావలీ జాతర



పకీర్‌షావలీ గుట్టపైకి చేరుకుంటున్న భక్తులు

ఎల్కతుర్తి: మండలంలోని దామెర గ్రామంలో ప్రతీ ఉగాది పర్వదినం రోజున కులమతాలకు అతీతంగా జరిగే పకీర్ షావలి జాతరకు భక్తులు పోటెత్తారు. మంగళవారం జరిగిన ఈ జాతరలో ముస్లింలే కాకుండ హిందువులు సైతం అధిక సంఖ్యలో పాల్గొని పకీర్ షావలి సమాధిని దర్శించుకున్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి జాతర



కడవెండి దేవునిగుట్టపై క్యూలైన్‌లో భక్తులు


- దేవునిగుట్టకు భక్తుల తాకిడి
- పోలీసుల భారీ బందోబస్తు

దేవరుప్పుల: వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి గోవిందా.. గోవిందా.. నామస్మరణతో దేవునిగుట్ట జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించారు. చరిత్రాత్మకమైన దేవునిగుట్ట జాతరతో పాటు ఉగాది పర్వదినం కొత్త సంవత్సరం కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్సై చెన్నకేశువులు సిబ్బందితో గుట్టపై భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు. పది, ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గుట్ట నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పెద్ది రమేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, పూజారులు, అధికారుల సహకారంతో తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అత్యధికంగా గిరిజనులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోల ద్వారా చేరకుని స్వామి వారికి మొక్కులు చెల్లించుకుని ఇక్కడే విడిది చేశారు. దుకాణ సముదాయాలతోపాటు చిన్నారుల ఆటవిడుపు కోసం మినీ సర్కస్ యూనిట్లు వెలిశాయి. పాటిమీది హనుమాన్ ఆలయంలో పూజారి ఉప్పల సురేష్‌బాబు, బీట్కూరు రంగాచార్యులు, సంపత్‌కుమార చార్యులు భక్తులకు ఆశీర్వచనాలు అందిస్తూ తీర్ధ ప్రసాదాలు అందించారు.

క్లుప్తంగా

కుటుంబ విలువలు పెంపొందించుకోవాలి

- శ్రీఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి


పంచాంగ పఠనం చేస్తున్న శ్రీనివాసాచార్యస్వామి

హన్మకొండ కల్చరల్ : నేటి సమాజంలో అంతరించిపోతున్న కుటుంబ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో సమాజం నైతికంగా పతనమవుతుందని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రం వ్యవస్థాపకులు శ్రీఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఉద్బోధించారు. వికాస్‌నగర్‌లోని శ్రీగోధామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో మంగళవారం సాయంత్రం 7గంటలకు జరిగిన కార్యక్రమంలో ఆయన ధార్మికప్రసంగం చేస్తూ ఈ ఏడాది ద్వాదశి రాశుల ఫలితాలు వివరించారు. శ్రీరాముడు అందించిన కుటుంబ విలువలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెన్నపురెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెల శిబిరంపై దాడులు

- సుమారు రూ.48 వేలు, 29 బైక్‌లు, 4 కార్లు, 33 పందెం కోళ్లు స్వాధీనం
- 10మందిపై కేసు నమోదు


పోలీసులు స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లు

నెల్లికుదురు : కోడిపందెల శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కాచికల్ శివారు ఆకేరు వాగు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. ఆకేరు వాగు సమీపంలో కోడిపందెల బెట్టింగ్ నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఘటనా స్థలికి చేరుకుని దాడులు నిర్వహించారు. ఇందులో సుమారు రూ.48 వేలు, 29 బైక్‌లు, 4 కార్లు, 33 పందెం కోళ్లు స్వాధీనం చేసుకుని 10 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మరికొంతమంది పరారయ్యారు. ఈ కోడిపందెల్లో ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్ జిల్లాలతో పాటు తొర్రూరు ప్రాంతం నుంచి పాల్గొన్నట్లు తెలిపారు. కాగా, కోడిపందెల శిబిరంలో రాజకీయ ప్రముఖుల హస్తం ఉన్నట్లు సమాచారం.

ఉత్తీర్ణత అంతంతే..

డిగ్రీ సెమిస్టర్ సిస్టమ్‌లోనూ మెరుగైన ఫలితాలేవి?

- మొదటి సెమిస్టర్‌లో 24.41 శాతం ఉత్తీర్ణతే
- మూడో సెమిస్టర్‌లో 30శాతం, ఐదో సెమిస్టర్‌లో 46.45శాతమే..
- ఫలితాల్లో బాలికలదే హవా



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఒకప్పుడు వార్షికం పేర డిగ్రీ పరీక్షలు జరిగేవి. అప్పట్లో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువ ఉండేది. దీంతో ఈ విధానం రద్దు చేసి కొన్ని సంవత్సరాల క్రితం సెమిస్టర్ సిస్టమ్ తీసుకొచ్చారు. ఈ విధానంలో ఉదాహరణకు ఒక సబ్జెక్టుకు 100 మార్కులు ఉంటే అందులో 20 మార్కులు ఇంటర్నల్ ఉంటాయి. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ, గురుకుల కళాశాలలో కూడా అధ్యాపకులు ఇంటర్నల్ మార్కులు వేస్తారు. ఇక ప్రతి సబ్జెక్టు 80 మార్కుల సెమిస్టర్ పరీక్ష, ఇంటర్నల్ మార్కులలో వచ్చిన మార్కులు కలిపే ఉత్తీర్ణత ప్రకటిస్తారు. అయినా వివిధ సబ్జెక్టులలో పాస్ మార్కులు కూడా సాధించలేక వేలాది మంది విద్యార్థులు ఫెయిలవుతున్న పరిస్థితి నెలకొంది. డిగ్రీ కోర్సుల్లో సెమిస్టర్ సిస్టమ్‌లో ఒక విద్యాసంవత్సరంలో రెండు సెమిస్టర్ల పరీక్షలు ఉంటాయి. ప్రతి సెమిస్టర్‌లో అప్పటి వరకు పూర్తయిన పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు ఇస్తారు. విద్యార్థులు తరగతులకు హాజరై ఏ కొద్దిపాటిగా చదువుకున్నా ఉత్తీర్ణత సాధ్యమే. ఎక్కువ మార్కులు రావాలంటే మాత్రం కొంత కష్టపడాల్సింటుంది. అయితే కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీబీఏ, బీ ఒకేషనల్ , బీ హానర్స్ కోర్సులలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలతోపాటు మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఇటీవల అధికారులు ప్రకటించారు. అయితే ఈ ఫలితాల్లో ఉత్తీర్ణత అంతంత మాత్రంగానే ఉండడం ఆందోళన కలిగిస్తుంది.

డిగ్రీ మొదటిసెమిస్టర్ పరీక్షల ఫలితాలు ఇలా..
-బాలురు కేవలం 16.29 శాతమే ఉత్తీర్ణత


డిగ్రీ ఆయా కోర్సుల్లో మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు 77,150మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 18,831మంది మాత్రమే (24. 41శాతం)మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. బాలురు 40,733మంది పరీక్షలకు హాజరైతే అందులో కేవలం 6,635మందే (16.29శాతమే)ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 36,417మంది పరీక్షలు రాస్తే అందులో12,196మంది(33.49శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత శాతం ఎక్కువ.

మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో..
-బాలురు 21.40 శాతమే ఉత్తీర్ణత

డిగ్రీ ఆయా కోర్సుల్లో కలిపి మొత్తం 59, 882మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే అందులో 17,965 మంది విద్యార్థులు (30శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 30,125మంది పరీక్షలకు హాజరైతే అందులో 6,450 మంది (21.40శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 29, 757మంది పరీక్షలు రాస్తే 11,515మంది (38.70శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణతే అధికంగా ఉంది.

ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లోనూ అదేతంతూ..

డిగ్రీ కోర్సుల్లో ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లోనూ అదేతంతుగా ఉంది. మొత్తం 52,418మంది విద్యార్థులకుగాను 23, 302 మంది ఉత్తీర్ణత (44.45శాతం) సాధించారు. బాలురు 26, 210 మంది పరీక్షలురాయగా 8,569మంది (32.69శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 26, 208మంది పరీక్షలకు హాజరైతే 14,733 మంది(56.22శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతంలో బాలికలే హవా కొనసాగించారు.



సెమిస్టర్ సిస్టమ్‌లో ఇంకా మెరుగైన ఫలితాలేవి?

డిగ్రీ కోర్సుల సెమిస్టర్ సిస్టమ్‌లో విద్యార్థులు సక్రమంగా తరగతలకు హాజరై కొంచెం కష్టపడినా పాస్ అవుతారు. అయితే మెరుగైన ఫలితాలు సాధించలేకపోవడానికి అనేక కారణాలున్నాయి. తరగతులకు విద్యార్థులు సరిగా హాజరుకావడం లేదనేది ప్రధాన ఆరోపణగా ఉంది. వాస్తవంగా 75శాతం హాజరు ఉండాలనే నిబంధన ఉంది. కానీ దానిని కళాశాలల్లో అమలు చేయడం లేదు. నాలుగేళ్ల క్రితం బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం తీసుకొచ్చారు. ఈ పరికరాల ఏర్పాటు కోసం విద్యార్థుల నుంచే పరీక్ష ఫీజులో రూ. 100 అదనంగా చెల్లించుకున్నారు కూడా. పేరుకు మిషన్లు ఏర్పాటు చేశాక కొంతకాలం నడిచాక కరోనా నేపథ్యంలో మూలకుపడేశారు. వాటి నిర్వహణకు సంబంధించి ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించడం.. అందుకు నిధులు వెచ్చించాల్సిరావడంతో నిర్వహణకు మళ్లీ ప్రయత్నించడం లేదు.

చదువుతూనే ఉపాధి మార్గంలో విద్యార్థులు

ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో ఎక్కువ శాతం పేద వర్గాలకు చెందిన వారే ఉంటారు. డిగ్రీ కోర్సుల్లో చేరాక కొందరు కళాశాలకు హాజరై అనంతరం పార్ట్‌టైంగా ప్రైవేటులో ఉపాధి పొందుతున్నవారు ఉండగా.. మరికొందరు క్లాస్‌లకు అంతంత మాత్రంగానే హాజరై ఏదో ఒక ప్రైవేటు ఉద్యోగం చేసుకునేవారు ఉన్నారు. దీంతో పలు కళాశాలల్లో విద్యార్థుల హాజరు 30 నుంచి 40శాతం వరకే ఉంటుందని తెలుస్తోంది. ఇక ఎక్కువశాతం ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కూడా విద్యార్థుల హాజరు తక్కువగానే ఉంటోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని చేర్చుకుంటున్నప్పటికీ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు యాజమాన్యాలు సరిపడా బోధనా సిబ్బందిని నియమించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని ప్రైవేటు కళాశాలలు సైన్స్ విద్యార్థులకు సరిగా ప్రాక్టికల్స్‌ను కూడా నిర్వహించడం లేదనే ఆరోపణలున్నాయి. విద్యార్థులు కూడా ఇతర వ్యాపకాలు, సెల్‌ఫోన్‌ల వినియోగంలో మునిగిపోవడం లాంటి అంశాలతో చదువుపై అంతగా దృష్టిసారించకపోవడంతో పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారు.

సెమిస్టర్ సిస్టమ్‌లో ఉత్తీర్ణత కావడం సులువే



డిగ్రీ కోర్సుల్లో విద్యార్థులు సెమిస్టర్ సిస్టమ్‌లో పరీక్షల్లో పాస్ కావడం సులువే. విద్యార్థులు రెగ్యులర్‌గా తరగతులకు హాజరైతే కొంచెం శ్రద్ధ వహించి చదివితే ఉత్తీర్ణతకావొచ్చు. ఒక సెమిస్టర్‌కాలంలో ఎన్నిపాఠ్యాంశాలకు బోధన జరిగితే అన్ని పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు వస్తాయి. కొద్దిగా కష్టపడి చదివినా జవాబులు రాయొచ్చు.

- డాక్టర్ రాజారెడ్డి, ప్రిన్సిపాల్, కేడీసీ హనుమకొండ

ప్రభుత్వ పింగిళి కళాశాలలో మెరుగైన ఫలితాలు ..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 14 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలుండగా అందులో రెండు అటానమస్ ఉన్నాయి. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల అటానమస్ కావడంతో వారే పరీక్షలు నిర్వహించుకుని ఆయా అధ్యాపకులే మూల్యాంకనం చేసుకుని ఫలితాలు వెల్లడిస్తున్నారు. మొదటి సెమిస్టర్‌లో 57.3శాతం, మూడో సెమిస్టర్‌లో 60.4శాతం, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 78.7శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కూడా అటానమస్ స్టేటస్ వచ్చాక ఈఏడాది జనవరిలో సొంతంగానే డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఇటీవల ఫలితాలు ప్రకటించారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 81శాతం, బీఎస్సీ లైఫ్‌సైన్సెస్‌లో 79శాతం, బీఏలో 50శాతం, బీకాంలో 52శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

సతీష్ గౌడ్‌కు డాక్టరేట్


సతీష్ గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ భౌతికశాస్త్రం విభాగంనుంచి జలగం సతీష్‌గౌడ్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. భౌతికశాస్త్రం అధ్యాపకుడు డా. నాచగోని నర్సింహులు పర్యవేక్షణలో 'లోహ ఆక్సైడ్‌ల నానో కణాలను పీవీఏ మాత్రికలో పొందుపరచిన నానో సంయోజకాల తయారీ, లక్షణీకరణ' అనే అంశంపై శోధనకు ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. 20ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్న సతీష్‌గౌడ్ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ట్రైబల్ గురుకుల డిగ్రీ కాలేజీలో భౌతికశాస్త్రం బోధిస్తున్నారు. సతీష్‌గౌడ్‌కు డాక్టరేట్ పట్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్‌రావు, ధ్యాన శిక్షకులు నందిగామా జనార్దనాచారి, అధ్యాపక బృందం, మిత్రులు అభినందనలు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడి

- 5వేల లీటర్ల పానకం పారబోత
- 200 లీటర్ల గుడుంబా స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు


గుడుంబా స్థావరంపై దాడులు నిర్వహిస్తున్న ఎస్సై

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామం టేకుతోట పరిసర ప్రాంతంలో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో గుడుంబా తయారీ కోసం నిల్వ చేసిన ఐదువేల లీటర్ల పానకం పారబోశారు. 200 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన బోడ దేవ్‌సింగ్ గుడుంబా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు. దేవ్‌సింగ్‌తోపాటు అతడికి సహకరించిన అదే గ్రామానికి చెందిన జంగపల్లి తిరుపతి, లావుడ్యా తిరుపతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, దేవ్‌సింగ్‌కు గుడుంబా తయారీకి ఎంజీల్ ఈస్ట్ ప్యాకెట్లతోపాటు చెక్కెరను అందించిన కిరాణాషాపు యాజమానులు బొమ్మ మహేష్, నర్సింహపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

బతకలేక.. బలవన్మరణం.

వివిధ కారణాలతో ఉమ్మడి జిల్లాలో ముగ్గురి ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెలలో వలస కూలీ, ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం వీఆర్‌కే పురంలో యువకుడు, భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెంకట్రావుపల్లిలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.

కురవి: ఉరేసుకుని ఓ వలస కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నల్లెల జరిగింది. సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన పకీర్ (27), తన తండ్రి, మరికొందరు వ్యక్తులు మిరపకాయలు ఏరేందుకు నల్లెల్లకు వచ్చారు. కొన్ని నెలలుగా ఇక్కడే ఉండి మిరపతోటల్లో కాయలు ఏరుతున్నారు. ఈ క్రమంలో పకీర్ గత వారం క్రితం నాందేడ్‌లో తన భార్యతో గొడవ పడి తన తండ్రి ఉన్న నల్లెల్లకు వచ్చాడు. సోమవారం సాయంత్రం తండ్రితో బయటకు వెళ్తున్నానని చెప్పాడు. నల్లెల్ల శివారులోని లింగ్యాతండా వెళ్లే మార్గంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌రాం కుమార్ మంగళవారం తెలిపారు.

వీఆర్‌కే పురంలో యువకుడు..


కార్తీక్ మృతదేహం

వెంకటాపురం(కె) : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని వీఆర్‌కే పురంలో జరిగింది. గ్రామానికి చెందిన కార్తీక్ (26) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్తులు కార్తీక్‌ను వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. చికిత్స నిర్వహిస్తుండగానే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకట్రావుపల్లిలో వ్యక్తి..


సదయ్య (ఫైల్)

చిట్యాల: తమకు కూతురు జన్మించి ఉంటే తమ బాగోగులు చూసుకోవడానికి అప్పుడప్పుడు వచ్చేదని, ఈ విషయంపై కొంతకాలంగా మనస్తాపం చెందుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెంకట్రావుపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాంపల్లి సదయ్య(55) సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన అనంతరం స్వగ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. కాగా, సదయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా, చిన్న కుమారుడు సింగరేణి ఉద్యోగిగా స్థిర పడ్డాడు. దీంతో సదయ్య, తన భార్య ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో తమకు కూతురు జన్మించి ఉంటే అప్పుడప్పుడు చూసి వెళ్లేదని బాధపడేవారు. ఈ విషయంలో కొంతకాలంగా మనస్తాపం చెందుతున్న సదయ్య.. జీవి తంపై విరక్తి చెంది చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాజీలేదు


మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం: ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో రాజీలేదని, ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేసి తీరుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి స్వగ్రామం కాటారం మండలం ధన్వాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు గ్యారంటీలను అమలు చేశామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల ద్వారా రూ. 40 కోట్ల టికెట్లు విలువైన ఉచిత ప్రయాణాలు చేశారన్నారు. రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాలను సమర్థవంతంగా చేరవేస్తున్నామని తెలిపారు. పథకాల అమలుపై కొందరు రాద్ధాంతం చేస్తున్నారని, ఏదీఏమైనా హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని, ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ గాడీలో పెడుతున్నామన్నారు. వర్షపాతం తక్కువగా నమోదై సాగునీరు, తాగునీటి ఇబ్బందులు ఉంటాయని నిపుణులు చెప్పారన్నారు. కానీ కాంగ్రెస్ కరువు తెచ్చిందని బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారాలు చేయడం హాస్యాస్పదమన్నారు. రానున్న ఎన్నికల్లో ఓట్లు పొందడానికి ప్రభుత్వంపై బురదజల్లె ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హామీ ప్రకారం చిన్నకాళేశ్వరం పనులు తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, కాంగ్రెస్ శ్రేణులు అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో కష్టపడాలని సూచించారు. అంతకుముందు గ్రామంలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. మంత్రి వెంట ఎంపీపీ పంతకాని సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, చీమల సందీప్, కామిడీ వెంకట్‌రెడ్డి, వంశీవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి ఎద్దు, గేదెల మృత్యువాత


మృత్యువాత పడిన ఎద్దు, గేదెలు

సంగెం: చెరువులో పడి ఎద్దు, మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్లలో జరిగింది. గ్రామంలో ఏటా ఉగాది పర్వదినం రోజు గుండబ్రహ్మయ్య జాతర జరుగుతుంది. ఈ జాతరలో రైతులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఇందుకోసం గ్రామానికి చెందిన రైతు పత్తిపాక రమేష్ తన పాలేరుతో ఎడ్లు, గేదెలు, బండిని చెరువులో శుభ్రం చేసుకురావాలని పురమాయించాడు. పాలేరు ఎడ్లబండికి గేదెలను కట్టుకుని చెరువు వద్ద వెళ్లాడు. చెరువులోకి బండితో సహా దిగి ఎడ్లను శుభ్రం చేస్తున్న క్రమంలో బెదిరి లోపలికి లాక్కొనిపోయాయి. గతంలో రోడ్డు నిర్మాణానికి మోరం తీసిన గుంతలోకి ఎడ్లబండితో సహా గేదెలు కూరుకుపోయాయి. ఇందులో ఒక్క ఎద్దు ప్రాణంతో బయటపడగా ఒక ఎద్దు, మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి. ట్రాక్టర్ సాయంతో గుంతలో పడి మృత్యువాత పడిన ఎద్దు, గేదెలను బయటకు తీశారు. ఘటనపై రైతు రమేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ. 2లక్షలు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వికసించిన 'చిన్ కాక్టస్'


వికసించిన చిన్ కాక్టస్ పుష్పం

శాయంపేట మండలం పెద్ద కోడెపాక గ్రామానికి చెందిన వన ప్రేమికుడు కోమనేని రఘు ఇంటి ఆవరణలోని ప్రకృతి వనంలో మంగళవారం ఉదయం చిన్ కాక్టస్(జాతి జిమ్నోకాలిసియం) పుష్పం వికసించింది. వన ప్రేమికుడు రఘు మాట్లాడుతూ ఈ మొక్కను 2018లో గుజరాత్ రాష్ట్రంనుంచి ఒక మిత్రుడు పంపించాడని తెలిపారు. ఈ మొక్క ఆకారం టెన్నిస్ బాల్‌సైజ్‌లో ఉండి గుండ్రని ఆకారం పోలి ఉంటుందని, ప్రతి ఏడాది మే నెలలో పువ్వు పూస్తుందని పేర్కొన్నారు.

- శాయంపేట

బస్‌స్టేషన్ కూల్చివేతల్లో భద్రతకు పాతర..

- ట్యాంక్ పైభాగం కూలి కార్మికుడి మృతి
- మృతదేహంతో బంధువుల ఆందోళన
- వరంగల్‌లో ఘటన


నేలమట్టమైన వాటర్ ట్యాంక్

వరంగల్ చౌరస్తా : వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ కూల్చివేతల్లో భద్రత నిబంధనలకు పాతరేశారు. కనీస ప్రమాణాలు పాటించకుండా వాటర్ ట్యాంక్‌ను నేలమట్టం చేయడంతో మంగళవారం దినసరి కార్మికుడు బొంతు రవి(40) మృతి చెందాడు. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆధునీకరణలో భాగంగా వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌లో నెల రోజుల నుంచి కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులోభాగంగా బస్ స్టేషన్ ఆవరణలోని వాటర్ ట్యాంక్ కూల్చివేతల్లో కాంట్రాక్టర్ కనీస ప్రమాణాలు, భద్రతాచర్యలు పాటించ లేదు. వాటర్ ట్యాంక్ కింది భాగంలో నలుగురు కార్మికులు పిల్లర్లకు రంధ్రాలు చేస్తుండగా ట్యాంక్ పై భాగం ఒక్కసారిగా నేలమట్టమైంది. ఈ ఘటనలో వరంగల్ 16 డివిజన్‌కు గరీబ్ నగర్‌కు చెందిన బొంతు రవి మృతి చెందారు. మిగతా కార్మికులు ప్రమాదం నుంచి బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య, పిల్లలు, బంధువులు బస్ స్టేషన్ ఆవరణానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. అయితే అప్పటికే రాత్రి కావడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

- శివునిపల్లిలో ఘటన


వాహనంలో గోవులు

స్టేషన్‌ఘన్‌పూర్: కరీంనగర్ నుంచి పాలకుర్తి మండలానికి అక్రమంగా తరలిస్తున్న గోవులను శివునిపల్లిలో హిందూసంఘాల బాధ్యులు మంగళవారం పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి సమీపం నుంచి పాలకుర్తి మండలం మల్లంపల్లికి రెండు టాటా గూడ్స్ వాహనాల్లో ఐదు గోవులు(నాలుగు ఆవులు, ఒక కోడె)తరలిస్తున్నారు. ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో వివేకానంద చౌరస్తా వద్ద హిందుసంఘాల బాధ్యులు అనుమానంతో ఆ వాహనాలను ఆపారు. వాటిలో నాలుగు ఆవులు, ఒక కోడె కనిపించగా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పశువులను ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు..? ఎక్కడకు తరలిస్తున్నారని ప్రశ్నించగా సరైన సమాచారం లేకపోవడం, వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడంతో పశువులతో సహా వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పశువులను ఘన్‌పూర్ మండలంలోని చంద్రుతండా గోశాలకు తరలించారు. అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న పాలకుర్తి మండలం మల్లంపల్లికి చెందిన మహేందర్, శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. కాగా, అక్రమంగా గోవులు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాలు గోరక్షణ, భజరంగ్‌దళ్, వీహెచ్‌సీ, బీజేవైఎం బాధ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పసునూరి సందీప్, కొలనుపాక శరత్‌కుమార్, ముక్క కుమారస్వామి, చింతపండు నాగేందర్, సదానందాచారి, గోనెల రమేష్, గుర్రపు అరవింద్, కుమ్మం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండి బోల్తా.. మహిళ మృతి


రాజక్క (ఫైల్)

మహదేవపూర్: ఎడ్ల బండి బోల్తా పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మహదేవపూర్ మండలం రాపల్లికోటలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాట్రేవుల లచ్చిమల్లు, తన భార్య రాజక్క (51) ఎండ్లబండి కట్టుకుని వంట చెరుకు కోసం అడవికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అడవిలో వాగు వద్ద ఎడ్లబండి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రాజక్క అక్కడికక్కడే మృతి చెందింది. లచ్చిమల్లుకు స్వల్పగాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న బంధువులు.. దంపతులను మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి రాజక్క మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ మంగళవారం తెలిపారు.